సాక్షి
జోగులాంబ గద్వాల

సోమవారం ၊ 5 ၊ ఆగస్టు ၊ 2024



జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టినట్లు అధికారులు తెలిపారు.

వివరాలు 8లో ▸



వాలీబాల్ అకాడమీపై..

మహబూబ్‌నగర్‌లోని వాలీబాల్ అకాడమీ నిర్వహణపై నీలినీడలు అలుముకున్నాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.2 /24.1

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడూ మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అభయాంజనేయస్వామికి అమావాస్య పూజలు



ఎర్రవల్లిచౌరస్తా: ఆషాడ అమావాస్యను పురస్కరించుకొని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని పలు ఆలయాలు ఆదివారం భక్తులతో రద్దీగా మారాయి. ప్రధానంగా అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో క్షేత్రానికి చేరుకొని శివాలయం, కోదండ రామస్వామి, సరస్వతీదేవితో పాటు అభయాంజనేయస్వామి ఆలయాలను దర్శించుకున్నారు. ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

నటుడు పూరి ఆకాశ్..



బీచుపల్లి పుణ్యక్షేత్రాన్ని ఆదివారం నటుడు పూరి ఆకాశ్ (డైరెక్టర్ పూరి జగన్నాథ్ కుమారుడు) సందర్శించారు. ఈ సందర్భంగా ఆషాడ అమావాస్యను పురస్కరించుకొని అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలను అందించి ఆలయ విశిష్టతను గురించి వివరించారు. ఆయన వెంట నిర్మాత రఘు చౌదరి, తదితరులు ఉన్నారు.

మైసమ్మ జాతరలో తగ్గిన భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరలో భక్తుల రద్దీ తగ్గింది. ఆదివారం అమావాస్య రావడంతో మైసమ్మ జాతరకు వచ్చేందుకు భక్తులు ఆసక్తి చూపలేదు. దాదాపు 4వేల మంది మాత్రమే మైసమ్మను దర్శించుకున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, వనపర్తి ఆర్టీసీ డిపోల నుంచి బస్సులను నడిపించారు.

ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్స్ ప్రారంభం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలోని బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్స్ ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ, పాలిటెక్నిక్, డిప్లొమా, ఓపెన్ ఇంటర్ పూర్తిచేసిన వారు మొదటి ఏడాదిలో నేరుగా ప్రవేశం పొందవచ్చన్నారు. ఈ నెల 18లోగా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని స్టడీ సెంటర్‌లో సంప్రదించి ఫీజు చెల్లించాలన్నారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించాలని సూచించారు.

ఫుట్‌బాల్ మహిళా జట్టు ఎంపిక



జడ్చర్ల టౌన్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి మహిళల ఫుట్‌బాల్ సెలక్షన్స్ బాదేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 48 మంది మహిళలు సెలక్షన్స్‌లో పాల్గొనగా 25 మందిని సన్నాహక శిబిరానికి ఎంపిక చేసినట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భానుకిరణ్ తెలిపారు. ఎంపికైన వారిలో ప్రతిభ కనబర్చిన వారిని ఈ నెల 16 నుంచి నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. మహిళల సెలక్షన్స్ జడ్చర్ల ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి మోయిన్, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సయ్యద్ ఇబ్రహీం, వార్డు కౌన్సిలర్ రఘురాంగౌడ్, పీడీలు వడెన్న, రాములు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నీటి విడుదల ఎప్పుడో..?

ఆర్డీఎస్ ఆయకట్టు రైతుల ఎదురుచూపులు



నీటిని విడుదల చేయకపోవడంతో వట్టిపోయిన ఆర్డీఎస్ ప్రధాన కాలువ

- అడ్డంకిగా మారిన భారత్‌మాల రోడ్డు, కాల్వ ఆధునికీకరణ పనులు
- ఆర్డీఎస్ ప్రధాన కాల్వపై కొనసాగుతున్న వంతెన నిర్మాణం
- తుమ్మిళ్ల లిఫ్ట్ ప్రారంభించక.. పంటలకు నీరందని వైనం

శాంతినగర్: చెంతనే తుంగభద్ర నది నీటితో కళకళలాడుతున్నా.. పంటలకు మాత్రం నీరందకపోవడంతో అలంపూర్ నియోజకవర్గంలోని ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ వైపు భారత్‌మాల ఆరు లేన్ల రోడ్డు పనులు.. మరో వైపు ఆర్డీఎస్ కాల్వ ఆధునీకరణ పనులు.. నీటి విడుదలకు అడ్డంకిగా మారాయి. ఆర్డీఎస్ ప్రధాన కాల్వపై భారత్‌మాల రోడ్డులో భాగంగా వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం వంతెన పిల్లర్ల దశలో ఉంది. ఇక ఆర్డీఎస్ కాల్వ ఆధునీకరణ పనులను సదరు కాంట్రాక్టర్ ఆలస్యంగా ప్రారంభించడం.. జూలై వరకు పనులు పూర్తి చేయాలని ఆదేశించినా ఇంకా కొనసాగిస్తుండడంతో కాల్వలకు నీరించడం సాధ్యపడడంలేదు. ఇక ఆర్డీఎస్ డిస్ట్రిబ్యూటరీ 22 వరకు వచ్చే నీటిని ఎత్తిపోసి డి–23 నుంచి ఆపై డిస్ట్రిబ్యూటర్లకు అందించేందుకు తుమ్మిళ్ల లిఫ్ట్ నిర్మించారు. కానీ, భారత్‌మాల, కాల్వ ఆధునీకరణ పనులతో తుమ్మిళ్ల మోటార్లు ప్రారంభానికి మరింత ఆలస్యమవుతోంది. దీంతో పంటలకు నీరందక ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కొంకల శివారులో వాడుబట్టిన పత్తి పంట

కెనాల్ ఆధునికరణ పనుల ఆలస్యంతో ఇక్కట్లు..

ఆర్డీఎస్ కెనాల్ ఆధునీకీకరణ, లైనింగ్ పనులు కర్ణాటక ప్రాంతంలో పూర్తి కాగా.. తెలంగాణ ప్రాంతంలో అసంపూర్తిగా ఉన్నాయి. ఇక్కడి రైతుల కోరిక మేరకు రెండేళ్ల క్రితం తెలంగాణ ప్రభుత్వం రూ.13 కోట్లు మంజూరు చేసింది. వాటిలో రూ.11.48 కోట్ల పనులకు అనుమతులు లభించాయి. కానీ, సదరు కాంట్రాక్టర్ ఆలస్యంగా పనులు ప్రారంభించి హరీబరీన 38 శాతం వరకు పనులు పూర్తిచేశాడు. అనంతరం నీరు విడుదల చేస్తున్నారనే సాకుతో అర్ధాంతరంగా పనులు వదిలేసి వెళ్లిపోయారు. ఈ ఏడాది పెండింగ్ పనులు జూలై నాటికి పూర్తిచేయాలని ఆదేశించినా.. ఆగస్టు వచ్చినా పూర్తి చేయకపోవడం గమనార్హం. ఈ పనుల ఆలస్యం కూడా కెనాల్‌కు నీటి విడుదల చేసేందుకు ఇక్కట్లు తెచ్చిపెడుతోంది.

చివరి ఆయకట్టుకు నీరందని వైనం

తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్ ఆన్ చేయడం, జూరాల లింక్ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయడంతో గతేడాది డిస్ట్రిబ్యూటరీ –33 వరకు పూర్తిస్థాయిలో సాగు నీరు అందింది. చివరన వున్న ఏడు డిస్ట్రిబ్యూటరీలు నీరు లేక వట్టిపోయాయి. ఈ ఏడాది రూ.4 కోట్లతో జంగిల్ క్లియర్, కెనాల్ స్ట్రైటెనింగ్, సీసీ బెడ్ల పనులు చేపట్టారు. మిగతా సుమారు రూ.4 కోట్ల పనులు చేపట్టాల్సి వుంది. ఈ ఏడాదైనా చివరి ఆయకట్టు డి–40 వరకు పూర్తిస్థాయిలో నీరందించి ఆర్డీఎస్ రైతులను ఆదుకోవాలని అలంపూర్, ఉండవెల్లి మండలాల రైతులు కోరుతున్నారు. ఇదిలాఉండగా, రూ.కోట్లతో చేపట్టిన పనుల్లో నాణ్యత కొరవడిందని, తనగల నుంచి రామాపురం శివారు వరకు కెనాల్ సైడ్ వాల్స్ బిల్లలు ఊడిపోయాయని రైతులు ఆరోపించారు.

నీరు త్వరగా వదలాలి



ఆర్డీఎస్ ఆయకట్టు క్రింద సాగుచేసిన పంటలు వాడుబట్టి ఎండిపోతున్నాయి. వెంటనే నీటిని విడుదల చేయాలి. ఆర్డీఎస్ డి–25 క్రింద 9 ఎకరాల్లో పత్తి, మిరప సాగుచేశాను. నీళ్ల లేక వాడుబట్టి పంటలు ఎండిపోతున్నాయి. చుట్టూ నీళ్లున్నా పంటలు ఎండిపోతున్నాయంటే అధికారులు ఆలోచించి వెంటనే నీళ్లొదలాలి.

– ఎండి షరీఫ్, రైతు, శాంతినగర్

త్వరలో తుమ్మిళ్ల లిఫ్ట్ ప్రారంభిస్తాం



ఆర్డీఎస్ ఆధునీకరణ పనులు పూర్తికాలేదు. అయినప్పటికి తుంగభద్రనదిలో నీటిప్రవాహం వున్నందున కెనాల్‌కు నీటిని విడుదల చేసేందుకు సిద్ధమయ్యాం. జూలెకల్ శివారులోని భారత్‌మాల రోడ్డు పనుల్లో భాగంగా కెనాల్‌పై బ్రిడ్జి పనులు చేపడుతున్నారు. రెండు అడుగుల మేర పిల్లర్ల పనులు పూర్తయ్యాయి. మరో నాలుగు రోజుల్లో ఏడడుగుల వరకు పిల్లర్ల పనులు పూర్తి కానున్నాయి. ఈ నెల 6వ తేదీలోగా తుమ్మిళ్ల లిఫ్ట్ మోటార్ ఆన్‌చేసి నీటిని పొలాలకు అందించేందుకు కృషిచేస్తాం.

– విజయ్‌కుమార్‌రెడ్డి, ఈఈ, ఆర్డీఎస్

‘భారత్‌మాల’ పనులతో ఆటంకం

తుంగభద్రనదిలో వరద ప్రవాహం వున్నా ఆర్డీఎస్ కెనాల్‌కు నీటిని విడుదల చేయడంలేదని అలంపూర్ నియోజకవర్గంలోని ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎగువన వున్న కర్నాటక ప్రాంతంలో 15 రోజులుగా కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యాం (టీబీ డ్యాం) నిండటం, అలంపూర్ నియోజకవర్గంలోని తుమ్మిళ్ల సమీపంలో తుంగభద్ర నది వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నా ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు వరద నీటిని వాడుకోలేని పరిస్థితులు దాపురించాయి. ఆర్డీఎస్ కెనాల్‌పై భారత్‌మాల పనులు జరుగుతున్నాయని, త్వరలో నీటిని విడుదల చేస్తామని ఓ వైపు అధికారులు చెబుతున్నా.. పంటలు సాగు చేసే సమయంలో నీరు వదిలితే ఎంతో ప్రయోజనం ఉంటుందని, ఎండిపోయాక నీరు వదులుతారా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్డీఎస్ ఆధునీకరణ పనులతో పాటు జూలెకల్ శివారులో వెళ్తున్న భారత్‌మాల ఆరు లేన్ల రహదారిలో చేపడుతున్న బ్రిడ్జి పనులు నీటి విడుదలకు ఆటంకంగా మారాయి. ఆర్డీఎస్ కెనాల్‌పై బ్రిడ్జి నిర్మిస్తుండగా.. బ్రిడ్జి నిర్మాణం కొరకు తీసిన మట్టితో కెనాల్ పూడుకుపోయింది. పిల్లర్లు కొంత మేర ఎత్తు నిర్మాణం చేపడితేనే నీటిని విడుదల చేయడానికి అవకాశం వుంటుందని, త్వరితగతిన బ్రిడ్జి పనులు చేపట్టనున్నట్లు ఆర్డీఎస్ అధికారులు తెలిపారు.

టూరిజం అభివృద్ధికి ప్రణాళిక



సరళాసాగర్ వద్ద మంత్రి జూపల్లి కృష్ణారావు, పక్కన ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, అనిరుధ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకర్, మేఘారెడ్డి, రాజేష్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు సంపత్‌కుమార్, సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

దేవరకద్ర/ మదనాపురం/ చిన్నచింతకుంట: పాలమూరు జిల్లాను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. టూరిజం స్టడీ టూర్‌లో భాగంగా ఆదివారం నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి దేవరకద్ర నియోజకవర్గంలోని కోయిల్‌సాగర్, సరళాసాగర్ ప్రాజెక్టులతోపాటు కురుమూర్తిస్వామి ఆలయాన్ని సందర్శించారు. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు వద్ద విలేకరులతో మంత్రి మాట్లాడుతూ.. పాలమూరులో ఎన్నో వనరులు, చారిత్రాత్మక ప్రదేశాలు ఉన్నాయన్నారు. వాటిని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి పరుస్తామన్నారు. గత ప్రభుత్వం పర్యాటకం విషయంలో నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. పర్యాటక కేంద్రాల అభివృద్ధితో రాష్ట్ర ఆదాయం పెరగడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. అదేవిధంగా ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించినట్లు అవుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో టూరిజం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. అందులో భాగంగా జిల్లాల వారీగా పర్యటించి, ప్రసిద్ధ ప్రాంతాలను గుర్తిస్తున్నామన్నారు. చట్ట సభలకు ఎన్నుకోబడిన ఎంపీలు, ఎమ్మెల్యేలతో చర్చించి, వారి అభిప్రాయాల మేరకు పర్యాటకాన్ని ముందుకు తీసుకుపోతామన్నారు. అనంతరం సరళాసాగర్ ప్రాజెక్టును పరిశీలించారు. కురుమూర్తిస్వామి ఆలయాన్ని వారు సందర్శించగా.. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజల అనంతరం శాలువాలతో సత్కరించారు. ఆలయ విశిష్టత, అభివృద్ధిపై ఎమ్మెల్యేలు, అధికారులతో మంత్రి జూపల్లి చర్చించారు. కురుమూర్తిస్వామి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం కోయిల్‌సాగర్‌లో ప్రత్యేక బోటులో విహరించారు.

రూ.3 కోట్లు మంజూరు..

కురుమూర్తిస్వామి ఆలయం, కోయిల్‌సాగర్, సరళాసాగర్ ప్రాజెక్టులను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడానికి రూ.3 కోట్లు మంజూరు చేస్తున్నట్లు మంత్రి జూపల్లి ప్రకటించారు. ఆయా ప్రాంతాల్లో రెండు రోజుల క్రితమే టూరిజం అధికారులు పర్యటించి, అక్కడి వనరులను గుర్తించినట్లు చెప్పారు. వారం రోజుల్లో ప్రతిపాదనలు పూర్తిచేసి, టూరిజం పనులు ప్రారంభిస్తామన్నారు. కోయిల్‌సాగర్, సరళాసాగర్‌లో పార్కులు, కాటేజీలు, రోడ్లు, ఆట స్థలాలు, స్పీడ్ బోట్లు వంటివి ఏర్పాటు చేయాలని కోరారని.. అవసరమైన వాటిని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పర్యాటక పనులు ప్రారంభిస్తే, కేంద్రం నుంచి కావాల్సిన వనరులు సమకూర్చడానికి తనవంతు కృషిచేస్తానన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేస్తే, పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, అనిరుధ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకర్, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మేఘారెడ్డి, కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు సంపత్‌కుమార్, సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్డీఓ నవీన్, తహసీల్దార్ కృష్ణయ్య, కురుమూర్తిస్వామి ఆలయ ఈఓ మదనేశ్వర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, నాయకులు ఎన్పీ వెంకటేష్, అరవింద్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

- విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలి
- తెలంగాణ మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి

వెల్దండ: మోడల్ స్కూల్ వసతిగృహం విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని.. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని తెలంగాణ మోడల్ స్కూల్స్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి హెచ్చరించారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ బాలికల వసతిగృహాన్ని ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో పలు రికార్డులతో పాటు విద్యార్థినుల కోసం తయారు చేసిన భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మోడల్ స్కూల్ వసతి గృహంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 60 మంది, ద్వితీయ సంవత్సరం 50 మంది విద్యార్థినులు ఉంటున్నారని.. శనివారం ఉడకని అన్నం తినడంతో పలువురికి కడుపునొప్పి వచ్చిందన్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని చెప్పారు. మరోసారి ఇలాంటి ఘటన పునరావృతమైతే కఠిన చర్యలు ఉంటాయని హాస్టల్ సిబ్బందిని ఆయన హెచ్చరించారు. విద్యార్థినులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని.. కమిటీ నిర్ధారణ తర్వాతే వంట చేసేవిధంగా చూడాలన్నారు. హాస్టల్‌లో ఏఎన్‌ఎం నియామకానికి చర్యలు తీసుకుంటామన్నారు. హాస్టల్ పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు విద్యుత్ లైట్లు, తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఎస్‌ఓకు సూచించారు.



వెల్దండ మోడల్‌స్కూల్ వసతిగృహం విద్యార్థినులతో మాట్లాడుతున్న రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి

■ మోడల్ స్కూల్ బాలికల వసతిగృహంలో డీఈఓ గోవిందరాజులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించడంతో పాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు. భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. డీఈఓ వెంట ప్రిన్సిపాల్ పుష్పలత, ఎస్‌ఓ స్రవంతి, స్వరూప, ఎంఈఓ శంకర్‌నాయక్ ఉన్నారు.

న్యాయం జరిగేనా..?!

జీఓ 317తో స్థానికత, మెడికల్, స్పౌజ్‌లో అన్యాయం జరిగిందని ఆవేదన

- ఒక జిల్లాలో స్థానికత ఉంటే.. మరోచోట పోస్టింగ్ ఇచ్చిన వైనం
- అత్యధికంగా నారాయణపేట, నాగర్‌కర్నూల్ నుంచి వినతులు
- వివిధ అంశాలపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1,937 మంది ఫిర్యాదులు
- అధికారులకు మొరపెట్టుకుంటున్న బాధితులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం కొత్త జిల్లాలు ఏర్పాటు చేసిన తర్వాత ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ఏర్పడిన ఐదు జిల్లాలకు విద్యాశాఖ సిబ్బందిని విభజిస్తూ జీఓ 317ను విడుదల చేసింది. ఈ క్రమంలో బదిలీలు జరిగి దాదాపు రెండేళ్లకు పైనే అవుతున్నా సమస్య ఇంకా పరిష్కారం కావడం లేదని బాధిత ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇందులో చాలా వరకు ఒక జిల్లాలో చదివి.. అదే జిల్లాలో స్థానికత ఉన్నవారిని సైతం ఇతర జిల్లాలకు కేటాయించారు. దీంతో కుటుంబ సభ్యులు ఒక జిల్లాలో.. విధులు నిర్వహించేది మరో జిల్లా కావడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. కొంత మందికి భార్య ఒక జిల్లాలో, భర్త మరో జిల్లాలో పనిచేస్తున్నారు. ఇలాంటి వాటిని పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసి.. బాధితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది.



బాధితులతో మాట్లాడుతున్న డీఈఓ రవీందర్ తదితరులు

ఉమ్మడి జిల్లాలో వచ్చిన దరఖాస్తులు ఇలా..	మహబూబ్‌నగర్	జోగులాంబ గద్వాల	నారాయణపేట	వనపర్తి	నాగర్‌కర్నూల్
	162	179	756	220	620

దరఖాస్తులు ఇలా..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 1,937 మంది ఉపాధ్యాయులు వివిధ కారణాలతో తమకు ఇబ్బంది కలిగిందని, వాటిని సరిచేయాలని దరఖాస్తు చేసుకున్నారు. అందులో అత్యధికంగా నారాయణపేట జిల్లాలో 756 మంది ఉండగా.. రెండో స్థానంలో నాగర్‌కర్నూల్ నుంచి 620 వచ్చాయి. మహబూబ్‌నగర్ నుంచి 162 దరఖాస్తులు మాత్రమే రాగా ఇందులో స్పౌజ్‌కు 40, మెడికల్‌కు ఆరు మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే నారాయణపేట, నాగర్‌కర్నూల్‌లో ఎక్కువగా మారుమూల ప్రాంతాలు ఉండడం, ప్రతిరోజు డ్యూటీకి వెళ్లి వచ్చేందుకు ఇబ్బందులు ఎదురవుతాయన్న కారణంతో ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తుంది. చాలామంది ఉపాధ్యాయులు చదువుకున్నది.. విధులు నిర్వహిస్తున్న జిల్లా వేర్వేరు కావడంతో తమ పిల్లలు స్థానికత కోల్పోయే ప్రమాదం ఉందని వాపోతున్నారు.

స్థానికత కోల్పోయి..



రెండేళ్ల క్రితం జీఓ 317 ప్రకారం బదిలీ అయ్యి స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు వెంటనే న్యాయం చేయాలి. అప్పటి బదిలీల్లో ఆప్షన్స్ ఇచ్చుకునే క్రమంలో మొదటి ప్రాధాన్యత కింద దరఖాస్తు చేసుకున్న వారికి న్యాయం జరిగితే సమస్య పరిష్కారమవుతుంది. స్పౌజ్ బాధితులకు సైతం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– హర్షవర్ధన్‌రెడ్డి, చైర్మన్, తెలంగాణ టీచర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ

మహబూబ్‌నగర్‌లోనే చదివా



నేను 1 నుంచి డిగ్రీ వరకు మహబూబ్‌నగర్‌లోనే చదివాను. స్థానికత ప్రకారం మహబూబ్‌నగర్ ఇవ్వాలి. కానీ, 317లో నాగర్‌కర్నూల్ జిల్లా లట్టుపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు బదిలీ చేశారు. అమ్మానాన్న కేవలం నా మీదే ఆధారపడి ఉన్నారు. వారి కోసం ప్రతిరోజు నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలకు వచ్చి వెళ్లే పరిస్థితి ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలి.

– సత్యవాణి, బాధితురాలు

కుటుంబం కోసం..



నాది మహబూబ్‌నగర్. నేను 1 నుంచి డిగ్రీ వరకు పూర్తిగా అక్కడే చదివాను. ఏ విధంగా చూసినా నాకు అక్కడే పోస్టింగ్ ఇవ్వాలి. కానీ, నారాయణపేట జిల్లా మారుమూల ప్రాంతంలోని పాఠశాలకు వేశారు. కుటుంబం అంతా కూడా మహబూబ్‌నగర్‌లో ఉంటే నేను మాత్రం నారాయణపేట జిల్లాకు ప్రతిరోజు వచ్చి పోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి తక్షణమే న్యాయం చేయాలి.


– ప్రమిద, బాధితురాలు

జిల్లా మారితే జీరో సర్వీస్..

జిల్లాల వారిగా వచ్చిన దరఖాస్తులను అధికారులు రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయానికి పంపించారు. ఇందులో ఉన్న సమస్యలు మంత్రివర్గ ఉపసంఘానికి పంపించి పరిష్కారం చూపిస్తారని ఉపాధ్యాయులు ఆశిస్తున్నారు. ఈ క్రమంలో చాలా వరకు స్థానికత సమస్య ఉన్న దరఖాస్తులు ఎక్కువగా ఉన్నాయి. ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు మారితే ఉపాధ్యాయుల సర్వీస్‌ను జీరోగా పరిగణలోకి తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. గతంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సుమారు 360 మంది ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు మ్యూచువల్‌గా బదిలీ అయిన ఉపాధ్యాయుల సర్వీస్ జీరో అయ్యింది. ఈ క్రమంలో జీఓ 317 వారికి కూడా ఒకవేళ జిల్లాల వారీగా బదిలీలు చేస్తే సర్వీస్ జీరో అవుతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఇదే జరిగితే ఇటీవల ఉద్యోగాల్లో చేరిన వారికంటే జూనియర్‌గా మారే అవకాశాలు ఉన్నాయి. అందుకోసం సదరు నిబంధన తొలగించి బదిలీలు చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మన్యంకొండకు శ్రావణ శోభ

- నేటి నుంచి విశేషోత్సవాలు ప్రారంభం
- రోజు శాంతిహోమం, తులసినామార్చన
- స్వర్ణాభరణ అలంకరణలో దర్శనమివ్వనున్న వేంకటేశ్వరస్వామి


మన్యంకొండ దేవస్థానం


అలంకరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలు (ఫైల్)

మహబూబ్‌నగర్ రూరల్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేషోత్సవాలు ప్రారంభం కానుండగా.. సెప్టెంబరు 8వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఇందుకుగాను ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయంలో ఏటా శ్రావణమాసంలో నెలరోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు రోజు శాంతి హోమం నిర్వహిస్తారు. విశేషోత్సవాల సందర్భంగా స్వామివారిని బంగారు ఆభరణాలతో అలంకరించి అభిషేకాలు, అర్చనలు చేస్తారు. అదేవిధంగా శనివారం రాత్రి శేషవాహనసేవ, బుధ, గురు, శుక్రవారాల్లో ప్రత్యేక అభిషేకాలు.. రోజు వెయ్యి తులసి దళాలతో ప్రత్యేక అర్చన నిర్వహిస్తారు.

ప్రత్యేక కార్యక్రమాలు..

ఈ నెల 15న విష్ణుసహస్రనామ అఖండ పారాయణం, 27న శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా హనుమద్దాసుల కీర్తనలతో అఖండ భజన, 31న శ్రావణమాసం చివరి శనివారం ఉట్ల కార్యక్రమం, సెప్టెంబరు 8న పూర్ణాహుతి, సమారాధన కార్యక్రమాలు ఉంటాయని ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు తెలిపారు. శ్రావణమాస విశేషోత్సవాల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

జనసంద్రమైన శ్రీరామకొండ


దర్శనానికి బారులు తీరిన భక్తులు, ఇన్‌సెట్‌లో కొండపై ఆలయంలో సీతారామాంజనేయుడి మూల విగ్రహాలు

- రామపాదం దర్శనానికి బారులు తీరిన భక్తులు

కోయిల్‌కొండ: ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని శ్రీరామకొండ క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున 3 నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు లక్ష మందికి పైగా భక్తులు రామనామాన్ని పటిస్తూ శ్రీరామపాదాన్ని దర్శించుకున్నారు. ఉదయం కొండపై ఉన్న శ్రీరామపాదానికి పురోహితులు పంచామృత అభిషేకం, సహస్రనామార్చన, నైవేద్యం, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం అమావాస్య రోజున శ్రీరామపాదాన్ని దర్శించుకుంటే కోరిన కోర్కెలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కిక్కిరిసిన కురుమతిగిరులు..

చిన్నచింతకుంట: అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం అమ్మాపురం కురుమూర్తి ఆలయానికి భక్తులు భారీగా తరలి వచ్చారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయాన్ని శుద్ధిచేసి సుప్రభాతసేవ నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం నుంచే ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి దర్శనానికి బారులుతీరారు. మెట్లపై దీపాలు వెలిగిస్తూ గోవిందనామ స్మరణతో స్వామివారి చెంతకు చేరి కొబ్బరికాయలు కొట్టి దర్శించుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ దిగువన మట్టికుండలో నైవేద్యం తయారుచేసి స్వామికి సమర్పించారు. కొండపైన ఉన్న అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి, ఉద్దాల మండపం వద్ద భక్తుల రద్దీ కనిపించింది.


కురుమూర్తిస్వామి దర్శనానికి క్యూలైన్‌లో నిల్చున్న భక్తులు

కిటకిటలాడిన అలంపూర్ ఆలయాలు


చండీహోమంలో పాల్గొన్న భక్తులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలు ఆదివారం భక్తజన సంద్రంగా మారాయి. ఆదివారం అమావాస్య కలిసి రావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. వాహనాలు గాంధీచౌక్ వరకు నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తింది. సగటు భక్తుడి దర్శనానికి సుమారు రెండు గంటల సమయం పట్టింది. ఇదిలా ఉండగా వీఐపీల తాకిడితో ఆలయ సిబ్బంది విసుగెత్తిపోయారు. ఎస్‌ఐ నాగరాజు దర్శనానికి కొందరిని తీసుకొచ్చారు. మెయిన్‌గేట్‌కు తాళం ఉండటంతో అటెండర్లు ఎవరూ లేరా అంటూ ఆలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీఐపీల తాకిడి ఎక్కువగా ఉందని.. సిబ్బంది అంతా దర్శనాలు చేయించేందుకే వెళ్లారని సీనియర్ ఉద్యోగి శేఖర్ బదులివ్వగా దురుసుగా మాట్లాడారు. ఎస్‌ఐ ప్రవర్తనతో ఆలయ సిబ్బంది కాసేపు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

జోగుళాంబ సన్నిధిలో మెదక్ ఎంపీ..

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను ఆదివారం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు కుటుంబసమేతంగా, బీజేపీ అసెంబ్లీ ఫ్లోర్‌లీడర్ ఆలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, ఇబ్రహీంపట్నం బీజేపీ కంటెస్టెంట్ ఎమ్మెల్యే ధనుంజయగౌడ్ వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు.

414 చండీహోమాలు..

ఆదివారం అమావాస్య కలిసి రావడంతో చండీహోమానికి భక్తులు పోటెత్తారు. మొత్తం 414 మంది హోమాలు నిర్వహించగా.. రూ.4.14 లక్షల ఆదాయం సమకూరింది. ఇదిలా ఉండగా అన్నదాన సత్రంలో రెండు వేల మందికి అన్నదానం చేసినట్లు సత్రం మేనేజర్ ప్రదీప్ తెలిపారు.


మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

కార్మికుల సంక్షేమం విస్మరిస్తే పుట్టగతులుండవు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలరాజ్

నాగర్‌కర్నూల్‌రూరల్: కార్మిక సంక్షేమాన్ని విస్మరించే ఏ ప్రభుత్వానికైనా పుట్టగతులు ఉండవని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.బాలరాజ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సింగిల్‌విండో మినీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో కోట్లాది మంది అసంఘటిత రంగ కార్మికులు కనీస వేతనాలకు నోచుకోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ హయాంలో కార్మికవర్గ సంక్షేమం సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. కార్మికుల సగటు జీవన ప్రమాణాలు దిగజారిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న మోదీ సర్కార్‌కు సమరశీల కార్మిక పోరాటాలతోనే తగిన బుద్ధి చెబుతామని పిలుపునిచ్చారు. కార్ల్‌మార్క్స్, లెనిన్ సిద్ధాంత పటిమతో కార్మికులు నిత్య చైతన్యవంతమై వర్గ రహిత సమాజ స్థాపనకు ఉద్యమించాలని కోరారు. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9 నుంచి దేశవ్యాప్త కార్మిక ప్రచార ఉద్యమం చేపట్టినట్లు తెలిపారు. అనంతరం పలు అంశాలపై ఏఐటీయూసీ రాష్ట్ర నేత సింగ్ నర్సింగ్‌రావు, సీపీఐ రాష్ట్ర నేత ఉమామహేష్ మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ, ఏఐటీయూటీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ, జిల్లా అధ్యక్షుడు కిరణ్, కార్యదర్శి శివశంకర్, బోయ ఆంజనేయులు, శ్రీరాములు, మాసమ్మ, సీహెచ్ కొండన్న, సురేష్, శ్రీహరి, గోపాలకృష్ణ, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల తయారీదారులపై కేసు

జడ్చర్ల: బాలానగర్ మండలం గౌతాపూర్ సమీపంలో పట్టుబడిన కల్తీ సేంద్రియం ఎరువులుగా అనుమానిస్తున్న ఘటనకు సంబంధించి 3న 'సాక్షి' దినపత్రికలో 'నకిలీ సేంద్రియం గుట్టు రట్టు తేలేనా'? శీర్షికన వచ్చిన కథనానికి వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. పట్టుబడిన ఎరువులకు ఎక్కడా ఉదాసీనత కనబరచకుండా నిబంధనల మేరకు ముందుకు వెళ్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. తయారీదారులపై పోలీస్‌స్టేషన్‌లో 420 కేసు నమోదు చేయించామని, గోదాంను సీజ్ చేసి ముందు తీసుకునే చర్యలపై దృష్టి సారించామన్నారు. ఎరువుల శాంపిల్స్ తీసేందుకు జిల్లా వ్యవసాయాధికారికి నివేదిక సమర్పించామని, డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ తదుపరి ఉత్తర్వుల మేరకు చర్యలు చేపడుతామని తెలియజేశారు.

క్లుప్తంగా

శ్రీధర్‌రెడ్డి హత్య కేసులో కీలక మలుపు?

చిన్నంబావి: మండలంలోని లక్ష్మీపల్లికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్య కేసులో కీలక మలుపు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యంతో విచారణ వేగవంతమైంది. ఇటీవల గ్రామానికి చెందిన నలుగురిని విచారణ నిమిత్తం తీసుకెళ్లినట్లు సమాచారం. తీసుకెళ్లిన వారిలో ఓ గర్భిణి కుటుంబానికి చెందిన ఒకరు ఉన్నారని.. దీంతో ఆమె ఒక్కతే ఇంటివద్ద ఉండటంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పోలీసు అధికారుల వద్ద ప్రస్తావించగా అలాంటిదేమీ లేదని.. ఎవరిని అదుపులోకి తీసుకోలేదని సమాధానమిచ్చారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

అచ్చంపేట రూరల్: అనుమానాస్పదంగా ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని బొల్లట్‌పల్లి గ్రామపంచాయతీ డొక్కుతండాలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తండాకు చెందిన ముడావత్ లక్ష్మణ్(36) కొన్ని రోజులుగా మద్యం తాగుతుండటంతో భార్యాభర్తలిద్దరూ తరచూ గొడవ పడేవారు. మద్యం మానాలని భార్య సునీత ఎన్నిమార్లు చెప్పినా వినకపోవడంతో సోదరులకు చెప్పడంతో మందలించారు. ఆదివారం మద్యం తాగి ఇంటికి రావడంతో మళ్లీ గొడవపడ్డారు. ఇంట్లో నిద్రిస్తూ.. అనుమానాస్పదంగా మృతిచెందాడు. ఆహారం కొన్ని రోజులుగా తినడం లేదని కుటుంబ సభ్యులు చెప్పారు. ఈ విషయంపై అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు లక్ష్మణ్ తరఫు కుటుంబ సభ్యులు చెప్పారు. మృతుడికి భార్యతో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి..

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రమాదవశాత్తు కింద పడటంతో వ్యక్తి మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా.. జిల్లా కేంద్రానికి చెందిన స్వామి (49)కూలీపని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి మూర్ఛ రావడంతో కిందపడి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం గేటు ఎదుట మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

చెరువులో పడి మరొకరు..

జడ్చర్ల: స్థానిక పాతబజార్‌కు చెందిన మేకల సుధాకర్(40) సమీప చెరువులో ప్రమాదవశాత్తు పడి మృత్యువాత పడ్డాడు. ఏఎస్‌ఐ విష్ణు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సుధాకర్‌కు మూడు మాసాలుగా అనారోగ్యంగా ఉండటంతో ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి భోజనం చేసిన తరువాత వాకింగ్ కోసం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆదివారం చెరువులో మృతదేహం తేలడంతో గుర్తించారు. మృతుడి భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వివరించారు.

వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

ఉప్పునుంతల: ఉప్పునుంతల మండల కేంద్రానికి చెందిన ఆలూరి పరమేష్ తనను లైంగికంగా వేధించి చంపుతానని భయపెట్టినట్లు అదే గ్రామానికి చెందిన ఆలూరి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు ఆదివారం నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు. ఈ నెల 1న మధ్యాహ్నం ఇంట్లో తాను ఒంటరిగా ఉన్న సమయంలో పరమేష్ వచ్చి వేధించి వెళ్లాడని, తిరిగి అదే రోజు రాత్రి ఇంటికి వచ్చి మరోసారి వేధించాడని చెప్పింది. తన అరుపులు విన్న ఇరుగుపొరుగు వారు వచ్చే వరకు అతను పారిపోయాడని చెప్పింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

లారీని ఢీకొట్టిన కారు



అడ్డాకుల: అతివేగంగా వెళ్తున్న కారు ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో కారులోని యువకుడు దుర్మరణం చెందిన సంఘటన అడ్డాకుల మండలం కందూర్ స్టేజీ వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లికి చెందిన కుర్వ వెంకటేష్(30) ప్రైవేటులో ఉద్యోగం చేస్తున్నాడు. సొంత పని నిమిత్తం ఆదివారం కారులో హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యం కందూర్ స్టేజీ సమీపంలో అతివేగంగా వెళ్తున్న కారు ముందు వెళ్తున్న కంటెయినర్ లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో కారులోని వెంకటేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. కారు పైభాగం పూర్తిగా విరిగిపోయి వెనక్కి వెళ్లింది. ఇరుక్కుపోయిన వెంకటేష్ మృతదేహాన్ని టోల్‌ప్లాజా సిబ్బంది అతికష్టం మీద బయటకు తీశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోదరుడు కుర్వ రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలియజేశారు.

జూరాలకు స్వల్పంగా తగ్గిన ఇన్‌ఫ్లో


సుంకేసుల నుంచి దిగువకు వెళ్తున్న వరదనీరు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కాస్త తగ్గుముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం ప్రాజెక్టుకు 2,90,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, ఆదివారం సాయంత్రానికి 2,60,000క్యూసెక్కులు ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 34 గేట్లను ఎత్తి 2,28,830 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 21,524 క్యూసెక్కుల నీటిని వినియోగించుకుంటున్నారు. ఆవిరి రూపంలో 44, కుడి కాల్వ ద్వారా 704, ఎడమ కాల్వకు 820, నెట్టెంపాడుకు 750, కోయిల్ సాగర్‌కు 315, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 2,52,987 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 8.3 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 3,10,556 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని, ప్రాజెక్టు నుంచి 2,50,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 75.805 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 2,50,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. 25 గేట్లను ఎత్తి 2,22,850 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 26.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

76.951 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జూరాల జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతుంది. ఇప్పటి వరకు 76.951 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపట్టినట్లు జెన్‌కో ఎస్‌ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ అన్నారు. ఆదివారం ఎగువలోని కేంద్రంలో ఐదు యూనిట్ల ద్వారా ఉత్పత్తి చేపట్టామన్నారు.

సుంకేసులకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుంది. ఎగువన ఉన్న ప్రాజెక్టులు నిండటంతో భారీగా వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ఆదివారం ఎగువ నుంచి 1,30,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, 28 గేట్లు తెరిచిన అధికారులు 1,27,396 క్యూసెక్కులు దిగువన శ్రీశైలంకు వదిలి, 2,354 క్యూసెక్కులు కేసీ కెనాల్‌కు వదిలినట్లు జేఈ రాజు తెలిపారు.

జల హోరు.. జనం జోరు


కృష్ణానదిలో బోటులో తిరుగుతున్న సందర్శకులు


శ్రీశైలం రహదారిలో ద్విచక్రవాహనదారులు


పుష్కరఘాట్లలో ఉన్న సందర్శకులు

ఉమ్మడి జిల్లాలోని జలాశయాలు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో జూరాల, శ్రీశైలం జలాశయాలకు భారీఎత్తున వరద వస్తోంది. దీంతో ఆయా ప్రాజెక్టులతోపాటు బీచుపల్లి, కొల్లాపూర్ సమీపంలోని సోమశిల వద్దకు సందర్శకులు తరలివస్తున్నారు. ప్రధానంగా శ్రీశైలం ఆనకట్ట వద్ద కృష్ణమ్మ పరవళ్లను తిలకించడానికి పర్యాటకులు పోటెత్తారు. ఒకవైపు కార్లు, మరోవైపు బైక్‌లపై యువకులు, వీరి మధ్యన ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు డ్రైవర్లు అష్టకష్టాలు పడ్డారు. ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి కృష్ణానది పుష్కరఘాట్ దగ్గర సందర్శకుల సందడి కనిపించింది. వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు కుటుంబ సభ్యులతో తరలివచ్చి సందడిగా గడిపారు. సోమశిల సమీపంలో కృష్ణానది బ్యాక్ వాటర్‌లో మర బోట్లలో సందర్శకులు విహరించారు.

– దోమలపెంట/ కొల్లాపూర్ రూరల్/ ధరూరు/ఎర్రవల్లిచౌరస్తా


బీచుపల్లి పుష్కరఘాట్ వద్ద పర్యాటకులు

వాలీబాల్ అకాడమీపై నీలినీడలు


వాలీబాల్ అకాడమీలో ఏర్పాటుచేసిన కోర్టులు

- పాలమూరులో రెండేళ్ల క్రితం అకాడమీ పునఃప్రారంభం
- 19 నెలల కిత్రం క్రీడాకారుల ఎంపికలు నిర్వహించిన ప్రవేశాలు కల్పించని వైనం
- కోచ్‌ల నియామకాలు సైతం చేపట్టని అధికారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: క్రీడాకారుల సౌకర్యార్థం 2004లో రాష్ట్ర క్రీడాప్రాధికారిక సంస్థ జిల్లాకు వాలీబాల్ అకాడమీ మంజూరు చేసింది. అకాడమీ ఏర్పాటు తర్వాత నాలుగేళ్ల కాలంలో జిల్లా క్రీడాకారులు ఎంతో ప్రతిభ కనబరిచారు. అప్పట్లో ఈ వాలీబాల్ అకాడమీ రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇక్కడ శిక్షణ పొందిన జిల్లా క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. వీరు మొదట అకాడమీలో వాలీబాల్ క్రీడలో ఓనమాలు నేర్చుకొని దేశానికి ప్రాతినిధ్యం వహించారు. ఇదే అకాడమీలో శిక్షణ పొందిన పలువురు క్రీడాకారులు జాతీయ సీనియర్ వాలీబాల్ పోటీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే నిర్వహణ భారంతో 2008లో వాలీబాల్ అకాడమీని మూసివేశారు.

రూ. 19.70 లక్షల వ్యయంతో పునఃప్రారంభం

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో వాలీబాల్ అకాడమీని తిరిగి ఏర్పాటు చేయాలనే డిమాండ్ మేరకు రెండేళ్ల క్రితం రూ. 19.70 లక్షల వ్యయంతో పునఃప్రారంభించారు. స్టేడియం ఆవరణలోగల స్విమ్మింగ్ పూల్‌లోని పైఅంతస్తులో గదులను అకాడమీ క్రీడాకారుల వసతికి కేటాయించి ఆధునీకరించారు. స్టేడియంలోని రెండు పాత వాలీబాల్ కోర్టులను తీసివేసి, వాటి స్థానంలో కొత్త కోర్టులు ఏర్పాటుచేశారు. కోర్టుల చుట్టూ నాలుగు ఫ్లడ్ లైట్లు, ప్రత్యేక షెడ్లు, గ్యాలరీ నిర్మించారు. గోడల చుట్టూ ఆకర్షణీయంగా వాలీబాల్ క్రీడాచిత్రాలను తీర్చిదిద్దారు. అయితే వాలీబాల్ అకాడమీలో క్రీడాకారులకు ప్రవేశాలు కల్పించడంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

ప్రవేశాలపై సందిగ్ధం..

నూతన వాలీబాల్ అకాడమీలో ప్రవేశాల కోసం 2022 డిసెంబర్ 1న అండర్ 14 – 18 ఏళ్ల బాలబాలికలకు ఎంపికలు నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి 233 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో 187 మంది బాలురు, 46 బాలికలు ఉన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అకాడమీకి ఎంపిక చేస్తారు. అయితే క్రీడాకారుల ఎంపికలు నిర్వహించి 19 నెలలు గడుస్తున్నా ఇంతవరకు ప్రవేశాలు కల్పించలేదు. అకాడమీలో కోచ్‌ల నియామకాలు కూడా కాలేదు. అయితే గతంలో జరిగిన ఎంపికల్లో ప్రతిభ చాటిన బాలబాలికలకు అకాడమీలో ప్రవేశాలు కల్పిస్తారా.. లేదా మళ్లీ ఎంపికలు నిర్వహిస్తారా అనే దానిపై సందిగ్ధం నెలకొంది.

క్రీడాకారులకు వసతుల కల్పన..

వాలీబాల్ అకాడమీలో చేరే క్రీడాకారుల కోసం పలు వసతులను ఏర్పాటుచేశారు. స్విమ్మింగ్ పూల్‌లోని పైఅంతస్తు గదులను క్రీడాకారులకు కేటాయించారు. ఇప్పటికే మంచాలు, టేబుల్స్, బీరువాలతో పాటు ఇతర సామగ్రి వచ్చింది. వాలీబాల్ అకాడమీ ఏర్పాటయినా క్రీడాకారులు ప్రవేశం పొందకపోవడంపై సీనియర్ క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాలీబాల్ అకాడమీలో ప్రభుత్వం మరిన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి, ప్రవేశాలు కల్పించాలని కోరుతున్నారు.

స్పోర్ట్స్ అథారిటీ దృష్టికి తీసుకెళ్తాం..



మహబూబ్‌నగర్ మెయిన్ స్టేడియంలోని వాలీబాల్ అకాడమీలో ప్రవేశాల కోసం మరోసారి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ దృష్టికి తీసుకెళ్తాం. త్వరలో అకాడమీలో క్రీడాకారుల ప్రవేశాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే కొంతమేర క్రీడాకారుల వసతి సామగ్రి వచ్చింది. వాలీబాల్ అకాడమీతో నైపుణ్యంగల క్రీడాకారులను వెలికి తీయవచ్చు. మెరుగైన క్రీడాశిక్షణ లభిస్తుంది.

– ఎస్.శ్రీనివాస్, డీవైఎస్‌ఓ

చుక్కల దుప్పి మృతి

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి జీలుగాయికుంట అటవీ సరిహద్దు ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చుక్కల దుప్పి మృతి ఆదివారం సాయంత్రం మృతి చెందింది. మూడు రోజులుగా శ్రీశైలంకు వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు చేస్తున్న క్రమంలో రోడ్డు దాటలేని పరిస్థితి ఉంది. ఈ క్రమంలో చుక్కల దుప్పి రోడ్డు దాటే క్రమంలో గుర్తు తెలియని వాహనం బలంగా ఢీకొట్టింది. దీంతో దుప్పి అక్కడిక్కడే మృతి చెందింది. అటవీశాఖ అధికారులు సిబ్బంది ఘటనా ప్రదేశానికి వెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిబ్బంది యాదయ్య తెలిపారు.


మృతి చెందిన చుక్కల దుప్పి